# క్రైం కౌంటర్

APTEL/25/A2844

ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం    తెలుగు దిన పత్రిక

సంపుటి : 01    సంచిక : 22  క్రిష్ణా,  బుధవారం  15- 10 - 2025    పేజీలు : 4    వెల. 2 /-



**రిపోర్టర్లు కావలెను**

క్రైం కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో

- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు

కావలెను.

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

**98497 07349**





# గూగుల్ డేటా సెంటర్

**అక్టోబర్ 14క్రైమ్ కౌంటర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్రలో సరికొత్త అధ్యాయానికి మంగళవారం నాంది పడింది. ఢిల్లీ వేదికగా గూగుల్‌తో ఏపీ ప్రభుత్వం చరిత్రాత్మక ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ప్రకారం గూగుల్ విశాఖపట్నంలో 1 గిగావాట్ హైపర్ స్కేల్ డేటా సెంటర్ ఏర్పాటు చేయనుంది. ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, అశ్వినీ వైష్ణవ్, గూగుల్ క్లౌడ్ సీఈఓ థామస్ కురియన్, ఇతర ప్రతినిధుల సమక్షంలో ఈ చారిత్రక ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం గూగూల్ విశాఖలో సుమారుగా 15 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టనుంది. ఈ ప్రాజెక్టు ద్వారా విశాఖ ఏఐ సిటీగా మారుతుందని నిపుణులు, అధికారులు అభిప్రాయపడుతున్నారు.

ఇక గూగుల్ సంస్థ ఆసియాలో ఏర్పాటు చేస్తున్న అతిపెద్ద ప్రాజెక్టు కూడా ఇదే కావటం విశేషం. విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ద్వారా 2028-32 మధ్య కాలంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థూల ఉత్పత్తికి ప్రతి సంవత్సరం రూ.10,518 కోట్లు సమకూరుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. అలాగే సుమారుగా 1,88,220 ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. అయితే ఇంతటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టు కోసం గూగుల్ సంస్థ విశాఖను ఎందుకు ఎంచుకుందనేదీ ఆసక్తికరంగా మారింది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాజధాని అమరావతికి ఎంత ప్రాధాన్యం ఇస్తోందో తెలిసిన సంగతే. ఏ ఫర్ అమరావతి.. పీ ఫర్ పోలవరం అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడే స్వయానా చెప్పిన పరిస్థితి. అలాగే అమరావతిని అంతర్జాతీయ స్థాయి నగరంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఏపీ ప్రభుత్వం అమరావతిలో ఐకానిక్ నిర్మాణాలు, అంతర్జాతీయ స్పోర్ట్స్ సిటీ, అమరావతి ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం, అమరావతి ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు వంటి ప్రాజెక్టులు చేపడుతోంది. మరి ఇంతలా ప్రాధాన్యం ఇస్తున్న అమరావతిలో గూగుల్ డేటా సెంటర్ ఎందుకు ఏర్పాటు చేయలేదనే ఆసక్తి కూడా వ్యక్తమవుతోంది. అయితే దీనికి ప్రధానంగా కొన్ని కారణాలు చెప్తున్నారు నిపుణులు..

గూగుల్ డేటా సెంటర్ విశాఖలోనే ఎందుకంటే..

డేటా సెంటర్ నిర్వహించాలంటే ఎక్కువ మొత్తంలో మంచి నీరు అవసరం అవుతుంది. కూలింగ్ కోసం ఈ నీటిని ఉపయోగిస్తారు. అలాగే అత్యధిక స్థాయిలో విద్యుత్ కూడా అవసరం అవుతుందని నిపుణులు చెప్తున్నారు. ఈ నేపథ్యంలో గూగుల్ సంస్థ విశాఖను ఎంచుకుందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విషయానికి వస్తే సౌర శక్తి, పవన శక్తి ఎక్కువగా అందుబాటులో ఉంది. దీంతో విద్యుత్ కొరత తలెత్తే అవకాశం లేదని.. అలాగే సముద్రపు నీటిని డీశాలినేషన్ చేసుకుని మంచి నీటి అవసరాలు తీర్చుకోవచ్చనే ఉద్దేశంతోనే గూగుల్ డేటా సెంటర్ విశాఖలో ఏర్పాటు చేస్తున్నారని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అలాగే మన భారతదేశానికి సంబంధించిన డేటాను మన దేశంలోనే స్టోర్ చేయాలని కేంద్రం కోరినట్లు సమాచారం. దీంతో విశాఖలో ఏర్పాటు చేసే డేటా సెంటర్‌లో భారత్‌కు సంబంధించిన సమాచారాన్ని నిల్వ చేయనున్నట్లు తెలిసింది. మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే.. డేటా సెంటర్ ఏర్పాటు చేయాలంటే సీకేబుల్ అవసరం అవుతుంది.





**అమరావతి, అక్టోబర్ 14 క్రైమ్ కౌంటర్ న్యూస్ : :** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కి చెందిన సరస్వతి పవర్ షేర్ల బదిలీపై చెన్నైలోని అప్పీలేట్ ట్రిబ్యునల్ స్టేటస్ కో విధించింది. హైదరాబాద్‌లోని నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్‌లో తమ షేర్ల బదిలీపై ఇచ్చిన తీర్పును చెన్నైలోని అప్పీలేట్ ట్రిబ్యునల్‌లో జగన్ తల్లి విజయలక్ష్మి , చెల్లి షర్మిల సవాల్ చేశారు. జగన్ తల్లి, చెల్లెలు పేరిట రాసిన గిఫ్ట్ డీడ్‌లో షేర్లు పూర్తిగా బదిలీ కాలేదని, అందువల్ల షేర్ల బదిలీ చెల్లదని, అవన్నీ జగన్ వద్దే ఉన్నాయని హైదరాబాద్ తీర్పు ఇచ్చింది. ఈ క్రమంలో తీర్పును చెన్నై ట్రిబ్యునల్‌లో సవాల్ చేశారు విజయలక్ష్మి, షర్మిల. ఈ రోజు (మంగళవారం) చెన్నై ట్రిబ్యునల్‌లో దీనిపై విచారణ జరిగింది. ఈ విచారణ అనంతరం హైదరాబాద్ ఇచ్చిన ఉత్తర్వులపై స్టేటస్ కో విధించింది చెన్నై ట్రిబ్యునల్.

## వికసిత్ భారత్‌కు విశాఖ గూగుల్ డేటా సెంటర్ గొప్ప ముందడుగు:



**అమరావతి, అక్టోబర్ 14 క్రైమ్ కౌంటర్ న్యూస్ :** గమ్యస్థానం నుంచి 'వికసిత్ భారత్'కు మార్గం ఇప్పుడు సుగమం అవుతోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. విశాఖపట్నం %వి%15 బిలియన్ల గూగుల్ ఏఐ డేటా సెంటర్ ను భారతదేశపు మొట్టమొదటి ఏఐ నగరాన్ని పొందడం గొప్ప ముందడుగని అభివర్ణించారు. ఈ చొరవతో అందరికీ ఏఐ శక్తి నిజంగా తెలుస్తోందని ఉద్ఘాటించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు పవన్ కల్యాణ్. యువత, రైతులు, వైద్యులు, మత్స్యకారులు, మహిళలు విద్యార్థుల జీవితాలను ఏఐ ప్రభావితం చేస్తోందని చెప్పుకొచ్చారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ వికసిత్ భారత్ కోసం నిరంతరాయంగా చేస్తున్న కృషి.. ఆయన దార్శనికత సృష్టించిన ప్రపంచ విశ్వాసం ప్రత్యక్ష ఫలితం ఇదని చెప్పుకొచ్చారు. సీఎం చంద్రబాబు నాయుడు బ్రాండ్, నాలుగు దశాబ్దాల దార్శనిక అనుభవానికి స్పష్టమైన నిదర్శనమని ప్రశంసించారు పవన్ కల్యాణ్. భారత్‌లో ఏఐ హబ్‌ను నిర్మించడానికి ప్రతి పౌరుడి జీవన నాణ్యతను మెరుగుపరచడానికి ఈ సాంకేతికతను ఉపయోగించుకోవడానికి ఇది మన సమష్టి ఫలితమని తెలిపారు. ప్రభుత్వంతో పాటు, ఈ కొత్త పురోగతి యుగానికి మనమందరం అవసరమని వివరించారు. యువత ఆవిష్కరణలు చేయడం, పరిశోధన చేయడం, ఏఐ పరిశ్రమ స్థాయిని పెంచడం ద్వారా అందరం కలిసి మన భవిష్యత్తుని సరికొత్తగా నిర్మించుకుందామని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

## రాష్ట్ర చరిత్రలో సువర్ణ అధ్యాయం:




**అమరావతి, అక్టోబర్ 14 క్రైమ్ కౌంటర్ న్యూస్ :** గూగుల్ డేటా సెంటర్‌ను విశాఖలో ఏర్పాటు చేసేందుకు ఒప్పందం శుభ పరిణామమని హోం మంత్రి వంగల పూడి అనిత అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర చరిత్రలో ఇదొక సువర్ణ అధ్యాయంగా అభివర్ణించారు. గూగుల్ డేటా సెంటర్ రాకతో ఉత్తరాంధ్ర ప్రపంచ పటంలో నిలవనుందన్నారు. గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుతో 1.88 లక్షల మందికి ఉపాధి లభించనుందని తెలిపారు. గతంలో సీఎం చద్రబాబు హైదరాబాద్‌లో హైటెక్ సిటీ అభివృద్ధి చేశారని.. ప్రస్తుతం విశాఖను ఐటీ హబ్‌గా తీర్చి దిద్దబోతున్నారని అన్నారు.

2 లో

## విశాఖ గూగుల్ ఏఐ హబ్..

### భారత డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు బలం: ప్రధాని మోదీ



**అమరావతి, అక్టోబర్ 14 క్రైమ్ కౌంటర్ న్యూస్ :** డైనమిక్ సిటీ విశాఖపట్నంలో గూగుల్ ఏఐ హబ్‌ను లాంఛ్ చేయడంపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ హర్షం వ్యక్తం చేశారు. అన్ని కోణాల నుంచి వచ్చిన ఈ పెట్టుబడిలో గెగావాట్ - స్కేల్ డేటా సెంటర్ల రూపంలో మౌలిక సదుపాయాలు వికసిత్ భారత్‌కి దోహదం చేస్తాయని వ్యాఖ్యానించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ట్వీట్ చేశారు. సాంకేతికతను ప్రజలందరికీ అందుబాటులోకి తేవడంలో విశాఖపట్నంలోని గూగుల్ ఏఐ హబ్ చాలా శక్తివంతంగా పనిచేస్తోందని అభివర్ణించారు. గూగుల్ ముందడుగు అందరికీ ఏఐ అనే నినాదానికి ఊతం ఇస్తోందని ఉద్ఘాటించారు. భారత పౌరులకు కటిగ్ ఎడ్జ్ టూల్స్ అందించడంలో ఎంతో ఉపకరిస్తోందని వివరించారు. మన డిజిటల్ ఆర్థిక వ్యవస్థకి సహకరించడంతోపాటు సాంకేతికతలో ప్రపంచంలో భారత్‌ని బలంగా నిలుపుతోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. మరోవైపు.. ఏపీలో ఏఐ హబ్, డేటా సెంటర్ ఏర్పాటుపై అంతర్జాతీయంగా అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో గూగుల్ అండ్ ఆల్ఫాబెట్ సీఈవో సుందర్ పిచాయ్ ట్వీట్ చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీతో మాట్లాడటం ఎంతో గొప్పగా ఉందని చెప్పుకొచ్చారు. మొట్టమొదటి గూగుల్ ఏఐ హబ్‌ని విశాఖపట్నంలో ఏర్పాటు చేస్తున్న సందర్భంగా తమ ప్రణాళికలు తెలియజేశానని పేర్కొన్నారు సుందర్ పిచాయ్. ఏఐ హబ్ ఈ రంగంలో ఒక ల్యాండ్ మార్క్ అభివృద్ధిగా మారుతోందని ఉద్ఘాటించారు. ఈ హబ్‌లో గెగావాట్ - స్కేల్ కంప్యూట్ కెపాసిటీ, నూతన అంతర్జాతీయ సబ్ సీ గేట్ వే ఉన్నాయని వివరించారు. అతిపెద్ద విద్యుత్ ఆధారిత మౌలిక సదుపాయలు ఉండనున్నాయని వెల్లడించారు. తమ మెరుగైన సాంకేతికతను భారతీయ పెట్టుబడుదారులకు, ప్రజలకు అందించే కార్యక్రమం ఇదని అభివర్ణించారు. దేశం మొత్తం ఏఐని మరింత వేగవంతం చేయడంలో.. మరిన్ని పరిశోధనలకు ఇది ఆస్కారం ఇస్తోందని గూగుల్ సీఈవో సుందర్ పిచ్చాయ్ పేర్కొన్నారు.

## ప్రధాని మద్దతుతోనే సాధ్యం.. గూగుల్‌తో ఒప్పందంపై సీఎం



**న్యూఢిల్లీ, అక్టోబర్ 14 క్రైమ్ కౌంటర్ న్యూస్ :** గూగుల్‌తో ఏపీ ప్రభుత్వం ఒప్పందం చేసుకోవడం చాలా సంతోషంగా ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. మంగళవారం నాడు విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుకు సంబంధించిన ఢిల్లీలో జరిగిన సమావేశంలో సీఎం మాట్లాడుతూ.. ప్రధాని మోదీ మద్దతుతో ఇది సాధ్యం అయ్యిందన్నారు. తాను చూసిన ప్రధాన మంత్రులలో మోదీ ప్రత్యేకమన్నారు. విజినరీ, ఆలోచన తీరు, నిర్ణయాలు తీసుకోవడంలో ఆయనను ఎవరూ అందుకోలేరని కొనియాడారు. ప్రధాని

2 లో

## ఢిల్లీ: గూగుల్‌తో ఏపీ ప్రభుత్వం చారిత్రక ఒప్పందం



**ఢిల్లీ: అక్టోబర్ 14 క్రైమ్ కౌంటర్ న్యూస్ :** సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ సమక్షంలో ఒప్పందం జరిగింది. దీనిలో భాగంగా విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు, 2029 నాటికి విశాఖలో గూగుల్ డేటా సెంటర్ పూర్తికి ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రులు నిర్మలా సీతారామన్, అశ్వినీ వైష్ణవ్ పాల్గొన్నారు.

విశాఖలో రూ.87,520 కోట్ల పెట్టుబడులతో ఏఐ డేటా సెంటర్‌ను గూగుల్ ఏర్పాటు చేయనుంది. ఒక గిగా వాట్ కెపాసిటీతో ఏఐ డేటా సెంటర్ ఏర్పాటుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈ డేటా సెంటర్ వైద్యారోగ్యం, విద్య, వ్యవసాయం, పరిశ్రమలు తదితర రంగాల్లో సేవలు అందించనుంది. విశాఖ నుంచి

2 లో

# జీఎస్టీ 2.0పై అవగాహన, ఆయా వస్తువులను తగ్గింపు ధరలను అందించేందుకు ఏర్పాటు



**క్రైమ్ కౌంటర్ న్యూస్** విశాఖపట్నం, అక్టోబరు 14 జీఎస్టీపై ప్రజలకు అవగాహన కల్పించి, ధరలు ఎంత మేరకు తగ్గాయో వివరించడానికి, ఆయా వస్తువులను తగ్గింపు రేట్లపై అందించడానికి షాపింగ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ హరేంధిర ప్రసాద్ వెల్లడించారు. కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ మైదానంలో ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు ఈ ఫెస్టివల్ ఉంటుందన్నారు. వ్యాపార సంస్థలు, డ్వాక్రా సంఘాలతో కలిసి సుమారు 60 స్టాళ్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు లావాదేవీలు ఉంటాయని, అవగాహనకు శిబిరాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఇతర అధికారులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జీఎస్టీ అదనపు కమిషనర్ ఎస్.శేఖర్, అసిస్టెంట్ కమిషనర్ రాంబాబు, డీటీఓ మాధవి, హోటల్స్ అండ్ టూరిజం అసోసియేషన్ ప్రతినిధి పవన్ కార్తీక్, తదితరులు పాల్గొన్నారు. 21,786 మందికి షుగర్

క్యాన్సర్ బాధితులు 225 మంది...

జిల్లాలో ముగిసిన ఎన్‌సీడీ

(నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్) 3.0 సర్వే

4.0 ప్రారంభం

క్యాన్సర్‌ను ప్రాథమిక స్థాయిలో గుర్తించడమే లక్ష్యం

విశాఖపట్నం, అక్టోబరు 14

జిల్లాలో అసంక్రమిత వ్యాధుల (అంటువ్యాధులు కానివి)తో బాధపడుతున్న వారిని గుర్తించేందుకు నిర్వహించిన ఎన్‌సీడీ (నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్) 3.0 సర్వే ముగిసింది. గడిచిన ఏడాది నవంబరు నుంచి ఈ ఏడాది సెప్టెంబరు నెలాఖరు వరకు నిర్వహించిన ఈ సర్వేలో దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న రోగులను గుర్తించారు.

ఎన్‌సీడీ 3.0లో భాగంగా జిల్లాలో 18,32,792 మందిని పరీక్షించాల్సి ఉంది. అయితే 15,25,932 (83.26 శాతం) మందిని పరీక్షించారు. మరో 16.74 మందిని స్క్రీనింగ్ చేయాల్సి ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ఈ నెల నుంచి ఎన్‌సీడీ 4.0 సర్వేను జిల్లాలో అధికారులు ప్రారంభించారు. ఎన్‌సీడీ 3.0 సర్వే ప్రకారం జిల్లాలో 15 లక్షల మందికిపైగా ప్రజలను పరీక్షించగా, 62,180 మందికి హైపర్ టెన్షన్ (బీపీ) ఉన్నట్టు ప్రాథమిక పరీక్షల్లో గుర్తించారు. తదుపరి నిర్వహించిన పరీక్షల్లో 33,812 మంది బీపీతో బాధపడుతున్నట్టు తేలింది. అలాగే 21,786 మంది షుగర్‌తో బాధపడుతున్నట్టు తేలింది. ఇంకా 3,201 మందికి నోటి క్యాన్సర్ అనుమానిత లక్షణాలు ఉన్నట్టు గుర్తించి పరీక్షలు నిర్వహించగా 73 మందికి వ్యాధి ఉన్నట్టు తేలింది. అలాగే, రొమ్ము క్యాన్సర్ అనుమానిత కేసులు 1,969 గుర్తించగా, వారికి పరీక్షలు నిర్వహించగా 112 మందికి నిర్ధారణ అయ్యింది. అలాగే, సర్వైకల్ క్యాన్సర్ అనుమానిత లక్షణాలున్న 1,948 మందికి ఆరోగ్య శాఖ సిబ్బంది పరీక్షలు నిర్వహించగా 40 మందికి నిర్ధారణ అయింది. వారికి మెరుగైన వైద్య సేవలను అందించేందుకు కేజీహెచ్‌కు రిఫర్ చేశారు.

4.0 సర్వే ప్రారంభం..

జిల్లాలో ఎన్‌సీడీ 4.0 సర్వే ప్రారంభమైంది. ఈ సర్వే ప్రధానంగా క్యాన్సర్ కేసులను గుర్తించడమే లక్ష్యంగా సాగనుంది. 3.0 సర్వేలో క్యాన్సర్ కేసులు గుర్తింపు ఆశించిన స్థాయిలో జరగలేదని ప్రభుత్వం భావిస్తోంది. సుమారు ఏడాదిపాటు అత్యంత పకడ్బందీగా సర్వే నిర్వహించాలని సిబ్బందికి అధికారులు ఆదేశాలు జారీచేశారు. పట్టణాల్లో ఆశ కార్యకర్త, ఏఎన్ఎం, గ్రామీణ ప్రాంతాల్లో ఆశ కార్యకర్త, ఎంఎల్‌హెచ్‌పీ ఇంటింటికీ వెళ్లి స్క్రీనింగ్ చేయనున్నారు. గత కొన్నాళ్లుగా క్యాన్సర్ కేసులు గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో 4.0 సర్వే పూర్తిగా దానిపైనే సాగుతుందని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తించేలా సర్వే జరగనుందన్నారు.

నేటి నుంచి విద్యుత్ ఉద్యోగుల ఆందోళన

సరఫరాకు అంతరాయం లేకుండా ఏర్పాట్లు

డివిజన్‌లలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు

విశాఖపట్నం, అక్టోబరు 14 తమ డిమాండ్ల సాధనకు విద్యుత్ ఉద్యోగులు 15వ తేదీ (బుధవారం) నుంచి దశల వారీగా ఆందోళనలు చేపట్టనున్న నేపథ్యంలో సరఫరాకు అంతరాయం కలగకుండా ఏర్పాట్లు చేసినట్టు విశాఖ సర్కిల్ ఎస్ఈ జి.శ్యాంబాబు బుధవారం విలేకరులకు తెలిపారు. జోన్-1, జోన్-2, జోన్-3 డివిజన్ల పరిధిలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామన్నారు. ఎటువంటి పరిస్థితులు ఎదురైనా సమర్థంగా ఎదుర్కొనాలని సీఎండీ పృథ్వీతేజ్ ఆదేశించడంతో సిబ్బందితో పూర్తి సన్నద్ధతతో ఉన్నామన్నారు. సర్కిల్ కార్యాలయంతో పాటు జోనల్ కార్యాలయాలు 24/7 పనిచేస్తాయన్నారు. సరఫరా సమస్యలు ఎదురైతే 1912కు గాని, జోన్-1 9490610019, జోన్-2 9490610020, జోన్-3 9491030722 నంబర్లకు ఫిర్యాదు చేయాలని కోరారు.

# షరా మామూలే రహదారుల పక్కన యథావిధిగా దుకాణాలు

**రెండు వారాల కిందట ఆక్రమణల తొలగింపు**

**మళ్లీ వ్యాపారాలు ప్రారంభం**

**భారీగా దసరా మామూళ్లు దండుకున్న సిబ్బంది**

**టౌన్ ప్లానింగ్ విభాగం మొద్ద నిద్ర**

**చిత్తశుద్ధి లేని అధికారులు**

**కలిసిరాని ప్రజా ప్రతినిధులు**

**క్రైమ్ కౌంటర్ న్యూస్ అక్టోబర్ 14 :**రోడ్డు మార్జిన్ల ఆక్రమణలపై మహా విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ) వెనక్కి తగ్గింది. ప్రత్యామ్నాయం చూపకుండా వేలాది మందిని నడిరోడ్డుపై నిలబెట్టారని విమర్శలు రావడమే అందుకు కారణమని ప్రచారం జరుగుతోంది. తొలగించిన దుకాణాల్లో దాదాపు సగం అదే స్థానంలో తిరిగి కొనసాగుతున్నాయి. వారి నుంచి జీవీఎంసీ సిబ్బంది రోజువారీ వసూళ్లతో పాటు దసరా సమయంలో మామూళ్లు కూడా భారీగానే దండుకున్నారు.

విశాఖపట్నంలో నవంబరు నెలలో పెట్టుబడిదారుల సదస్సు జరగనుంది. దీనికి జాతీయ స్థాయిలో వ్యాపారవేత్తలు హాజరు కానున్నారు. ఆ సమయానికి నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం ఆదేశించింది. దీనికి అధికారులు ప్రణాళిక సిద్ధం చేసుకోగా, దాంతోపాటు ట్రాఫిక్ సమస్యలు లేకుండా రహదారుల పక్కన ఆక్రమణలను తొలగించాలని కొందరు ప్రజా ప్రతినిధులు సూచించారు. ప్రధాన రహదారులతో పాటు వీధుల్లో కూడా రోడ్ల పక్కన దుకాణాల సంఖ్య పెరిగిపోయిందని, వాటన్నింటినీ తొలగించాలని ఆదేశించారు. పలువురు ఎమ్మెల్యేలు దీనిని వ్యతిరేకించినా అధికారులు ముందుకువెళ్లారు. జేసీబీలు, పోలీసులు, సిబ్బందితో వెళ్లి దుకాణల తొలగింపు ప్రారంభించారు. ఏ ఒక్కరికీ ముందస్తు సమాచారం ఇవ్వలేదు. దాంతో కట్టుబట్టలతో చిల్లర వర్తకులు రోడ్డున పడ్డారు. జీవనాధారం పోవడం, పెట్టుబడుల నష్టం జరగడంతో అత్యధికులు అధికారుల చర్యలను తప్పుబట్టారు. ఇవేమీ పట్టించుకోకుండా అధికారులు దాదాపు రెండు వారాలు ఈ తొలగింపుల కార్యక్రమం కొనసాగించారు. సుమారు 40 వేలకు పైగా దుకాణాలను తొలగించారు.

దసరా పేరుతో విరామం

దసరా పండుగ వస్తున్న నేపథ్యంలో తొలగింపునకు విరామం ఇస్తున్నామని, పండుగ ముగిసిన తరువాత మిగిలిన ప్రాంతాల్లో దుకాణాలు తొలగిస్తామని జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు ప్రకటించారు. అయితే దసరా వెళ్లిన తరువాత ఆ పనులు ముందుకు సాగలేదు. తొలగించిన దుకాణాల్లో దాదాపు సగానికి పైగా మళ్లీ అదే స్థానంలో వెలిశాయి. ఇంతకుముందు స్టీల్, కలపతో చేసిన



దుకాణాల్లో వ్యాపారాలు నిర్వహించగా, ఇప్పుడు తోపుడుబండ్లు పెట్టుకొని వ్యాపారాలు చేస్తున్నారు. కొందరైతే ఇంతకు ముందులానే రహదారులను ఆక్రమించి నడిరోడ్డుపైనే లావాదేవీలు నిర్వహిస్తున్నారు. వీటిని ఎవరూ పట్టించుకోవడం లేదు. జీవీఎంసీ సిబ్బంది రోజూ వారి దగ్గరకు వెళ్లి జేబులు నింపుకొంటున్నారు. దసరా సందర్భంగా ఒక్కో దుకాణం నుంచి వేయి రూపాయల చొప్పున వసూలుచేశారు. అలాగే ఏ వ్యాపారమైతే ఆ సరకును సంచిలో వేసుకుని పట్టుకుపోతున్నారు. ఇవ్వకపోతే అక్కడి నుంచి దుకాణం తీసేయమంటారేమోనని వారు కిమ్మనకుండా అడిగింది ఇస్తున్నారు. ఇవేవీ జీవీఎంసీ ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడం లేదు. క్షేత్ర స్థాయి సిబ్బందిని ఈ విషయంలో బాధ్యులను చేయకపోవడం వల్ల వారి అండతోనే వ్యాపారాలు తిరిగి నడుస్తున్నాయి. ఆయా ప్రాంతాల్లో మళ్లీ దుకాణాలు రాకుండా చూడాల్సిన బాధ్యత వారిపై ఉందని జోనల్ కమిషనర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులు చెప్పకపోవడం మరో లోపం.

ప్రత్యామ్నాయం ఎక్కడ...?

జీవీఎంసీ వద్ద పేర్లు నమోదు చేసుకున్న వ్యాపారులు అందరికీ వెండింగ్ జోన్లు పెట్టి అక్కడ వ్యాపారాలకు అనువైన సదుపాయాలు కల్పిస్తామని జీవీఎంసీ అధికారులు ప్రకటించారు. అవి ఎంతవరకు వచ్చాయో తెలియదు. పెట్టుబడిదారుల సదస్సుకు ముందు ఇవన్నీ జరుగుతాయనే నమ్మకం లేదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ప్రజా ప్రతినిధుల్లోనే వ్యతిరేకత

కూటమి ప్రభుత్వంలో అత్యధిక శాతం శాసనసభ్యులు ఈ దుకాణాల తొలగింపును వ్యతిరేకిస్తున్నారు. అయితే ఆ విషయాన్ని బయట చెప్పడం లేదు. కొందరైతే జీవనోపాధి కోల్పోయిన వ్యాపారులకు సొంత నిధులతో దుకాణాలు ఏర్పాటు చేయించి, వారే వాటిని ప్రారంభించి భుజం తడుతున్నారు.

# మార్కెట్లోకి కల్తీ మద్యం తెచ్చింది జగనే

**క్రైమ్ కౌంటర్ న్యూస్: అక్టోబర్ 14 :**నిడదవోలు, అక్టోబరు 14 కూటమి ప్రభుత్వం మద్యం విషయంలో పారదర్శకంగా పనిచేస్తుంటే వైసీపీ నాయకులు బురద చల్లడమే పనిగా పెట్టుకున్నారని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ మండిపడ్డారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మద్యపాన నిషేధం విధిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన జగన్మోహనరెడ్డి ప్రభుత్వ మద్యం దుకాణాలు తెరిచారన్నారు. వైసీ పీ ప్రభుత్వంలో కల్తీ మద్యం కారణంగా వేలాది మంది ప్రాణాలు కోల్పోయార న్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం నవోదయం 2.0 ద్వారా నాటుసారాను పూర్తిగా నిర్మూలించామన్నారు. దాదాపు 21 జిల్లాలు నాటుసారా రహిత జిల్లాలుగా మార్చామని స్పష్టం చేశారు. రాజకీయ ముసుగులో తప్పుడు పనులు చేసేవారిపై కూటమి ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుందన్నా రు.

# గూగుల్ తో ఒప్పందం ఏపీ 'కి' మరో గేమ్ ఛేంజర్ ప్రాజెక్ట్..

**కూటమి తో రాష్ట్ర అభిరుద్ధి చెందుతుందన్న మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్..**



**ఎన్టీఆర్ జిల్లా,మైలవరం,అక్టోబర్ 14(బ్యూరో చీఫ్ సల్మాన్):** విశాఖపపట్నంలో 1 గిగావాట్ హైపర్ స్కేల్ డేటా సెంటర్ ఏర్పాటుకు ప్రముఖ సంస్థ గూగుల్ తో ఒప్పందం కుదుర్చుకోవడం ఏపికి మరో గేమ్ ఛేంజర్ అవుతుందని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ అన్నారు. ఢిల్లీ నుంచి ఉండవల్లి తిరిగి వచ్చిన సీఎం చంద్రబాబునాయుడు విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ లను వారి నివాసం వద్ద ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్, సహచర ఎమ్మెల్యేలు మంగళవారం కలిసారు అనంతరం సీఎం కు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ మన దేశంలోనే అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి ఇదేనన్నారు. సుమారు 15 బిలియన్ అమెరికా డాలర్లతో గూగుల్ డేటా సెంటర్ విశాఖలో ఏర్పాటుకు ఢిల్లీలో ఒప్పందం కుదుర్చుకోవడం ఒక చారిత్రక ఘట్టమన్నారు. దీనివల్ల ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. గూగుల్ డేటా సెంటర్ విశాఖలో కార్యకలాపాలు ప్రారంభిస్తే భారతదేశ ఏఐ రాజధానిగా ఆంధ్రప్రదేశ్ గుర్తింపు పొందుతుందన్నారు. సీఎం చంద్రబాబు దిశా నిర్దేశంలో, ఐటీ - ఎలక్ట్రానిక్స్ మంత్రి నారా లోకేష్ అవిశ్రాంత కృషితో, కూటమి ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహంతో ఏపీలో ప్రముఖ సంస్థలు పెట్టుబడులు పెట్టడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. హైటెక్ సిటీతో నాడు ప్రపంచ పటంలో హైదరాబాద్ పేరు మార్మోగించిన సీఎం చంద్రబాబు నాయుడు నేడు విశాఖలో గూగుల్ కంపెనీ రాకతో నవ్యాంధ్ర పేరు మార్మోగే విధంగా చరిత్ర సృష్టించనున్నారని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పేర్కొన్నారు.

# ఖరీఫ్ ధాన్యం సేకరణకు పకడ్బందీ ఏర్పాట్లు..!

**రైతు క్షేమం, సంక్షేమమే లక్ష్యంగా కార్యాచరణ ఉండాలి..!**


**సమావేశంలో మాట్లాడిన జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

**ఎన్టీఆర్ జిల్లా,విజయవాడ,అక్టోబర్ 14(క్రైం కౌంటర్ బ్యూరో చీఫ్ సల్మాన్):** జిల్లాలో రైతు సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఖరీఫ్ ధాన్యం సేకరణకు పగడ్బందీ ప్రణాళికలు రూపొందించి, అమలు చేయాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు.

ఖరీఫ్ 2025 - 26 ధాన్యం సేకరణకు సంబంధించి పౌరసరఫరాల సంస్థ ఆధ్వర్యంలో గాంధీనగర్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాల్‌లో మంగళవారం జిల్లాస్థాయి అవగాహన సదస్సు జరిగింది. పౌరసరఫరాలు, వ్యవసాయం, సహకార ఇతర శాఖల అధికారులు, కస్టోడియన్ అధికారులు తదితరులు పాల్గొన్న ఈ సమావేశంలో కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ జిల్లా మొత్తంలో 3,59,733 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తిని అంచనా వేయగా ప్రాథమికంగా సుమారు 3,03,154 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 159 రైతు సేవా కేంద్రాలు ద్వారా కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. ఈ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాల్సిందిగా, కొనుగోలు కేంద్రాల్లో ఎటువంటి అవకతవకలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులకు వాట్సాప్ ద్వారా ధాన్యం కొనుగోలు షెడ్యూల్‌ను తెలియజేయడం ద్వారా అవగాహన కల్పించాల్సిందిగా సూచించారు. అలాగే గన్నీలు, కార్మికులు, వాహనాలు అవసరానికి అనుగుణంగా అందుబాటులో ఉంచాలని, టార్పాలినులు కూడా అవసరమైన చోట్ల అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు రైతులకు కనీస మద్దతు ధర లభించే విధంగా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎక్కడా ఏ రైతూ ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఇబ్బంది పడకుండా చూడాలని.. క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించిన సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు కూడా నిర్వహించాలని ఆదేశించారు. తేమ శాతాన్ని కొలిచే యంత్రాలు సరిగా ఉన్నాయో లేదో చూసుకోవాలని సూచించారు. ఈ సదస్సులో జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ తో పాటు పౌరసరఫరాల డీఎం టి.వెంకట సతీష్, జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి, తిరువూరు ఆర్డీవో కె.మాధురి, నందిగామ ఆర్డీవో కె.బాలకృష్ణ, జిల్లా సహకార అధికారి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# సినిమా




## అక్కినేని అఖిల్ మిస్ అయ్యాడు.. నాని బ్లాక్ బస్టర్ కొట్టాడు.

సినిమా ఇండస్ట్రీలో అక్కినేని వారసత్వాన్ని కొనసాగిస్తూ హీరోగా ఎంట్రీ ఇచ్చాడు అఖిల్. మనంలో ఓ స్పెషల్ రోల్ లో నటించినప్పటికీ హలో సినిమాతో హీరోగా ఎంట్రీ ఇచ్చాడు. సినిమా నిరాశపర్చినప్పటికీ డ్యాన్స్ లు, ఫైట్స్ తో ఆకట్టుకున్నాడు. ఆ తర్వాత చేసిన మిస్టర్ మజ్ను కూడా కమర్షియల్ గా వర్కవుట్ అవ్వలేదు. అయితే బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వంలో వచ్చిన మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్ లర్ తో ఓ మోస్తరు హిట్ అందుకున్నాడు అఖిల్. కానీ భారీ అంచనాల మధ్య రిలీజైన ఏజెంట్ సినిమా బాక్సాఫీస్ వద్ద దారుణంగా ఫెయిల్ అయ్యింది. 2023లో ఈ సినిమా రిలీజ్ కాగా ఇప్పటివరకు అఖిల్ నుంచి మరో మూవీ రాలేదు. ప్రస్తుతం లెనిన్ అనే ఓ సినిమాలో నటిస్తున్నాడీ అక్కినేని అందగాడు. ఈ సినిమాతోనైనా అయ్యగారు హిట్ కొట్టాలని అభిమానులు గట్టిగా కోరుకుంటున్నారు. కకాగా సినిమా కథల విషయంలో కూడా అక్కినేని అఖిల్ కొన్ని తప్పటడుగులు వేస్తున్నాడని సినిమా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఎందుకంటే గతంలో తన దాకా వచ్చిన రెండు బ్లాక్ బస్టర్ సినిమాలను అఖిల్ అనవసరంగా వదులుకున్నాడట. ఆ సినిమాలను చేసిన ఇతర హీరోలు చేసి బ్లాక్ బస్టర్స్ అందుకున్నారు. స్టార్ హీరోలుగా క్రేజ్ అందుకున్నారు.అఖిల్ వదులుకున్న సినిమాల్లో ఒకటి నాని హీరోగా వచ్చిన దసరా సినిమా కాగా. ఈ కథ మొదట అఖిల్ దగ్గరికే వచ్చిందట. అయితే వివిధ కారణాలతో అక్కినేని హీరో దసరా సినిమాను వదులుకున్నాడట. కట్ చేస్తే ఈ సినిమాతోనే నాని బ్లాక్ బస్టర్ కొట్టాడు. ఈ మూవీ ఏకంగా వంద కోట్లకు పైగా కలెక్షన్లు సాధించింది.ఇక అఖిల్ మిస్ చేసుకున్న మరో సినిమా క. కిరణ్ అబ్బవరం హీరోగా నటించిన ఈ మిస్టరీ థ్రిల్లర్ మూవీ కూడా మొదట అక్కనేని హీరో దగ్గరికే వచ్చిందట. కానీ పెద్దగా ఇంట్రెస్ట్ చూపలేదట. కట్ చేస్తే.. ఈ సినిమా కూడా 50 కోట్లకు పైగా కలెక్షన్లు సాధించింది. కిరణ్ అబ్బవరం కు బ్లాక్ బస్టర్ ఇచ్చింది. ఒక వేళ అఖిల్ ఈ రెండు సినిమాలు చేసి ఉంటే అతని కెరీర్ ఫుల్ స్పీడ్ లో ఉండేదేమోనని పిస్తుంది.

ఇక లెనిన్ సినిమా విషయానికి వస్తే.. ఇందులో మొదట హీరోయిన్ గా శ్రీలీలను తీసుకున్నారు. అయితే ఇప్పుడామె స్థానంలో భాగ్యశ్రీ బోర్సేను కథానాయికగా ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. త్వరలోనే ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.





## ఈ ఒక్క మ్యాజిక్ జ్యూస్ తాగితే చాలు.. కీళ్ల నొప్పుల నుంచి నోటి దుర్వాసన వరకు అన్నింటికి చెక్..!

నేటి ఆధునిక జీవనశైలిలో జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండటం కష్టమే. అయితే ఆరోగ్యం దెబ్బతినకుండా ఉండాలంటే కూరగాయలు, పండ్ల వినియోగాన్ని పెంచడం చాలా ముఖ్యం. అలాంటి ఆరోగ్యకరమైన వాటిలో బీట్‌రూట్ రసం ఒకటి. తాగడానికి రుచికరంగా ఉండే ఈ జ్యూస్‌కు ఎన్నో వ్యాధులను నయం చేసే శక్తి ఉంది. బీట్‌రూట్ తినడానికి వెనుకాడే వారు కూడా ఈ జ్యూస్‌ను సులభంగా తయారు చేసుకుని, ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చు.బీట్‌రూట్ జ్యూస్ యొక్క అద్భుత ప్రయోజనాలు బీట్‌రూట్ రసం వివిధ రకాలుగా ఆరోగ్యాన్ని కాపాడుతుంది. ముఖ్యంగా ఈ జ్యూస్ వల్ల కలిగే ప్రయోజనాలు ఇక్కడ చూడండి:

రక్తపోటు నియంత్రణ: గర్భధారణ సమయంలో అధిక రక్తపోటు ఉన్న మహిళలకు బీట్‌రూట్ రసం చాలా సహాయపడుతుంది. రోజుకు రెండుసార్లు 100 మి.లీ రసం తీసుకోవడం వల్ల తల్లికి, బిడ్డకు మంచి ఆరోగ్యం లభిస్తుంది.గుండె %-% రక్త ప్రసరణ: ఈ రసం రక్త ప్రసరణ, సరఫరాకు అత్యంత మంచిది. వారం పాటు క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా గుండె జబ్బుల ప్రమాదం కూడా తగ్గుతుంది. క్రీడాకారులు కూడా దీనిని తీసుకోవడం ఉత్తమం.

కాలేయ శుద్ధి: బీట్‌రూట్ రసం కాలేయాన్ని శుభ్రపరుస్తుంది. కాలేయం ఓవర్‌లోడ్ అయినప్పుడు శరీరం లేదా నోటి నుండి దుర్వాసన వస్తుంది. అలాంటి వారు ఒక నెల పాటు ఈ రసాన్ని తాగడం వల్ల కాలేయ ఆరోగ్యం మెరుగుపడుతుంది.

కీళ్ల నొప్పుల ఉపశమనం: ఆర్థరైటిస్, రుమాటిజం, కీళ్ల నొప్పులతో బాధపడేవారు వారం పాటు క్రమం తప్పకుండా ఈ రసం తీసుకుంటే ఉపశమనం లభిస్తుంది.

జీర్ణక్రియ సమస్యలు: దీర్ఘకాలంగా మలబద్ధకం లేదా అజీర్ణంతో బాధపడుతున్న వారికి బీట్‌రూట్ రసం చాలా మంచిది. దీనిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల ఈ సమస్యల నుండి బయటపడవచ్చు.

రక్తహీనత, చర్మ కాంతి: బీట్‌రూట్ రసం రక్తహీనతను నయం చేయడంలో సహాయపడుతుంది. క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల చర్మ కాంతి కూడా పెరుగుతుంది.

రోగనిరోధక శక్తి : ఇందులో విటమిన్ సి, జింక్, ఐరన్, ఫోలేట్ పుష్కలంగా ఉ ంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచడానికి సహాయపడతాయి.

బీట్‌రూట్ జ్యూస్ ఎలా తయారు చేయాలి..?

ముందుగా బీట్‌రూట్ తొక్క తీసి శుభ్రంగా కడగాలి.

దానికి క్యారెట్ లేదా నారింజ వంటి ఇతర పండ్లను జోడించండి.

మీకు కావాలంటే కొంచెం తేనె కలిపి మిక్సీలో మెత్తగా రుబ్బి రసం తయారు చేసుకోండి.

తరచుగా తాగాలనుకుంటే, మిశ్రమాన్ని ఫ్రిజ్‌లో నిల్వ చేసుకోవచ్చు.

ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే, మీ దైనందిన ఆహారంలో ఈ శక్తివంతమైన బీట్‌రూట్ రసాన్ని చేర్చుకోవడం చాలా మంచిది.



## అమ్మ బాబోయ్.. గుడ్డు అంత డేంజరా

గుడ్లు అంటే శక్తికి, పోషకాలకు కేరాఫ్ అడ్రస్ అని అంటారు. చౌకగా లభించడం, శరీర బలాన్ని పెంచడం వంటి కారణాల వల్ల చాలా మంది ప్రతిరోజూ గుడ్లు తింటారు. అటు డాక్టర్లు సైతం రోజూ గుడ్డు తినమని చెబుతారు. అయితే గుడ్లు తినే వారికి షాకింగ్ కలిగించే వార్త ఒకటి తాజాగా వెలుగులోకి వచ్చింది. నెట్‌వర్క్‌లో ప్రచురించిన ఒక కొత్త అధ్యయనం గుడ్డు వినియోగంపై సంచలన విషయాన్ని వెల్లడించింది. దీంతో చాలా మందిలో ఆందోళన మొదలైంది.

కొత్త అధ్యయనంలో ఏముంది..?

నార్త్‌వెస్ట్రన్ విశ్వవిద్యాలయం పరిశోధకులు 29,615 మందిపై అధ్యయనం చేశారు. ఈ నివేదిక ప్రకారం.. ప్రతిరోజూ గుడ్లు తినడం వల్ల గుండె జబ్బులు, మరణ ప్రమాదం పెరుగుతుందని పరిశోధకులు తెలిపారు. ప్రతిరోజూ సగం గుడ్డు తినడం వల్ల 17.5 ఏళ్ల కాలంలో గుండె జబ్బుల ప్రమాదం 6 శాతం, మరణ ప్రమాదం 8 శాతం పెరుగుతుందని తేలింది. గుడ్లలోని కొలెస్ట్రాల్ దీనికి ప్రధాన కారణమని పరిశోధకులు చెబుతున్నారు.

ఒక గుడ్డులో ఎంత కొలెస్ట్రాల్..?

పరిశోధనలో భాగంగా పాల్గొన్న వ్యక్తులు ఎన్ని గుడ్లు తిన్నారు.. ఎలాంటి ఆహారం తీసుకున్నారు.. ఎంత వ్యాయామం చేశారు.. వంటి వివరాలను సేకరించారు. వారి ఆహారాన్ని 17.5 ఏళ్లు పర్యవేక్షించిన తర్వాత ఈ ఫలితాలు వచ్చాయి. ఒక గుడ్డులో సుమారుగా 186 మిల్లీగ్రాముల కొలెస్ట్రాల్ ఉంటుందని వెల్లడైంది. ఆహారం ద్వారా తీసుకునే ప్రతి 300 మిల్లీగ్రాముల కొలెస్ట్రాల్ వల్ల గుండె జబ్బుల ప్రమాదం 17 శాతం, మరణ ప్రమాదం 18 శాతం పెరుగుతుందని నివేదిక స్పష్టం చేసింది. గుడ్లలోని ఈ కొలెస్ట్రాల్ శరీరానికి హానికరం అని, అందుకే ఈ వ్యక్తులలో గుండె జబ్బుల ప్రమాదం పెరిగిందని పరిశోధకులు తెలిపారు.

నిపుణులు ఏమంటున్నారు..?

గుడ్లు నిజంగా మంచి శక్తి వనరు అయినప్పటికీ తాజా అధ్యయనం గుడ్లలోని కొలెస్ట్రాల్‌పై ఆందోళన వ్యక్తం చేసింది. అందువల్ల ప్రతిరోజూ గుడ్లు తినేవారు దాని పరిమాణాన్ని తగ్గించాల్సిన అవసరం ఉందని సూచించబడింది. అలాగే గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి కేవలం గుడ్లనే కాకుండా మొత్తం ఆహారం, తీసుకునే వ్యాయామం వంటి ఇతర జీవనశైలి అంశాలపై కూడా శ్రద్ధ వహించడం ముఖ్యమని నిపుణులు తెలియజేశారు.

## 4 రోజుల మ్యాచ్‌లు ఆడుతుంటే, వన్డేలు ఆడలేనా..?: సెలెక్టర్లను ఏకిపారేసిన టీమిండియా పేసర్

భారత సీనియర్ ఫాస్ట్ బౌలర్ మహమ్మద్ షమీ, ఆస్ట్రేలియాతో జరగబోయే వన్డే సిరీస్‌కు తనను ఎంపిక చేయకపోవడంపై బీసీసీఐ సెలెక్టర్లపై పరోక్షంగా అసంతృప్తి వ్యక్తం చేశాడు. తన ఫిట్‌నెస్‌పై వస్తున్న ఊహాగానాలకు తెరదించుతూ, తాను రంజీ ట్రోఫీలో నాలుగు రోజుల మ్యాచ్‌లు ఆడటానికి సిద్ధంగా ఉన్నప్పుడు, 50 ఓవర్ల వన్డే మ్యాచ్‌లు ఆడటంలో ఎలాంటి సమస్య లేదని స్పష్టం చేశాడు.గాయాలతో సతమతమవుతున్న షమీ, 2023 ప్రపంచకప్ ఫైనల్ తర్వాత భారత జట్టుకు దూరమయ్యాడు. చీలమండ గాయానికి శస్త్రచికిత్స చేయించుకుని, జాతీయ క్రికెట్ అకాడమీ లో పునరావాసం పొందాడు. ఇటీవలే దులీప్ ట్రోఫీలో ఈస్ట్ జోన్ తరఫున ఆడి తన ఫిట్‌నెస్‌ను నిరూపించుకున్నాడు. అయినప్పటికీ, ఆస్ట్రేలియాతో జరిగే పరిమిత ఓవర్ల సిరీస్‌లకు అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలెక్షన్ కమిటీ అతడిని పరిగణనలోకి తీసుకోలేదు.

బెంగాల్ తరఫున ఉత్తరాఖండ్‌తో జరగనున్న రంజీ ట్రోఫీ ప్రారంభ మ్యాచ్‌కు ముందు మంగళవారం మీడియాతో మాట్లాడుతూ, షమీ తన ఆవేదనను వ్యక్తం చేశాడు. “సెలెక్షన్ నా చేతుల్లో లేదు. ఒకవేళ నాలో ఫిట్‌నెస్ సమస్య ఉంటే, నేను ఇక్కడ బెంగాల్ తరఫున ఆడేందుకు సిద్ధంగా ఉండేవాడిని కాదు,” అని అన్నాడు. “ఈ విషయంపై నేను మాట్లాడి వివాదం సృష్టించదలుచుకోలేదు. కానీ, నేను నాలుగు రోజుల మ్యాచ్‌లు ఆడగలిగినప్పుడు, 50 ఓవర్ల క్రికెట్ కూడా ఆడగలను,” అని తన సామర్థ్యంపై నమ్మకాన్ని వ్యక్తం చేశాడు.తన ఫిట్‌నెస్ గురించి సెలెక్టర్లకు నివేదికలు ఇవ్వడం తన బాధ్యత కాదని షమీ తేల్చి చెప్పాడు. “నా ఫిట్‌నెస్‌పై అప్‌డేట్ ఇవ్వడం నా బాధ్యత కాదు. నా పని ఎన్‌సీఏకి వెళ్లి, సిద్ధమై, మ్యాచ్‌లు ఆడటమే. వారికి ఎవరు అప్‌డేట్ ఇస్తున్నారు, ఎవరు ఇవ్వడం లేదు అనేది వారి విషయం,” అని ఘాటుగా వ్యాఖ్యానించాడు.

చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్, షమీ ఫిట్‌నెస్‌పై తమకు ఎలాంటి సమాచారం లేదని గతంలో పేర్కొనడం గమనార్హం. అయితే, షమీ దేశవాళీ క్రికెట్‌లో తన ప్రదర్శన ద్వారానే సమాధానం చెప్పాలని నిర్ణయించుకున్నాడు.

జట్టు ఎంపిక తన చేతుల్లో లేకపోయినా, దేశం కోసం అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వడానికి




తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని షమీ తెలిపాడు. “దేశం కోసం అత్యుత్తమ ఆటగాళ్లను ఎంపిక చేయాలి. దేశం గెలవడం ముఖ్యం. మనమందరం సంతోషంగా ఉండాలి,” అని అన్నాడు.

గాయం నుంచి కోలుకున్న తర్వాత బలమైన పునరాగమనం చేయాలని తాను భావిస్తున్నానని, సెలెక్టర్లు ఎప్పుడు పిలిచినా తాను సిద్ధంగా ఉంటానని షమీ స్పష్టం చేశాడు. రంజీ ట్రోఫీలో తన ప్రదర్శన ద్వారా సెలెక్టర్ల దృష్టిని ఆకర్షించి, తిరిగి భారత జట్టులో చోటు దక్కించుకోవాలని షమీ పట్టుదలగా ఉన్నాడు.

## టీమిండియాతో సిరీస్‌కు ముందే ఆసీస్‌కు బిగ్ షాక్.

ఆస్ట్రేలియా లెగ్ స్పిన్నర్ ఆడమ్ జంపా, వికెట్ కీపర్-బ్యాట్స్‌మన్ జోష్ ఇంగ్లిస్ భారత్‌తో జరిగే తొలి వన్డేలో ఆడరు. క్రికెట్ ఆస్ట్రేలియా తొలి మ్యాచ్ నుంచి ఇద్దరు ఆటగాళ్లను ఉపసంహరించుకుంది. వారి స్థానంలో ఎడమచేతి వాటం స్పిన్నర్ మాథ్యూ కుహ్నెమాన్, వికెట్ కీపర్ జోష్ ఫిలిప్‌లను జట్టులోకి తీసుకున్నారు. జంపా తండ్రి కాబోతున్నాడు. జంపా రెండోసారి తండ్రి కాబోతున్నాడని నివేదించింది. అందుకే ఆయన పితృత్వ సెలవు తీసుకున్నారు. జంపా భార్య హ్యారియెట్ పామర్ 2022లో ఒక కొడుకుకు జన్మనిచ్చింది. ఆమె తల్లి కావడం ఇది రెండోసారి. 2021లో ఇద్దరూ వివాహం చేసుకున్నారు. తన బిడ్డ పుట్టే వరకు నార్తర్న్ న్యూ సౌత్ వేల్స్‌లోని తన ఇంట్లోనే ఉండాలని కోరుకుంటున్నట్లు జాంపా కి చెప్పాడు. అయితే, మిగిలిన రెండు వన్డేలకు జంపా తిరిగి రావచ్చు. ఎడమచేతి వాటం స్పిన్నర్ మాథ్యూ కుహ్నెమాన్ మొదటి వన్డేలో అతని స్థానంలో ఆడతాడు. అతను ప్లేయింగ్ ఎలెవన్‌లో చోటు దక్కించుకుంటే, మూడేళ్ల తర్వాత స్వదేశంలో అతనికి ఇది మొదటి వన్డే అవుతుంది. గాయం కారణంగా ఇంగ్లిస్ ఔట్ వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్ జోష్ ఇంగ్లిస్ గాయం కారణంగా మొదటి రెండు వన్డేలు ఆడలేడు. అతను హామ్ స్ట్రింగ్ స్ట్రెయిన్‌తో బాధపడుతున్నాడు. అతని స్థానంలో జోష్ ఫిలిప్ వికెట్ కీపర్‌గా కనిపిస్తాడు. రెగ్యులర్ వికెట్ కీపర్ అలెక్స్ కారీ ఫస్ట్ క్లాస్ క్రికెట్ ఆడుతున్నందున మొదటి వన్డేలో పాల్గొనడం లేదు. కారీ రెండవ వన్డేలో తిరిగి వస్తాడు. అక్టోబర్ 25న జరిగే మూడో వన్డేకు ఇంగ్లిస్ తిరిగి వస్తాడని %జూా% ఆస్ట్రేలియా ఆశిస్తోంది. అతను జట్టుకు మొదటి ఎంపిక వికెట్ కీపర్, కారీ బ్యాకప్ వికెట్ కీపర్‌గా వ్యవహరిస్తున్నాడు. గాయం కారణంగా సెప్టెంబర్‌లో న్యూజిలాండ్‌తో జరిగిన 20 సిరీస్‌కు కూడా ఇంగ్లిస్ దూరమయ్యాడు. కుడిచేతి వాటం వికెట్ కీపర్-బ్యాట్స్‌మన్ జోష్ ఫిలిప్ నాలుగు సంవత్సరాల తర్వాత ఆస్ట్రేలియా తరఫున వన్డేలు ఆడనున్నాడు . అతను చివరిసారిగా 2021లో వెస్టిండీస్‌పై వన్డే ఆడాడు. అదే సిరీస్‌లో వన్డేల్లో కూడా అరంగేట్రం చేశాడు. అతను జట్టు తరఫున 12 టీ20లు ఆడాడు. కానీ అతని చివరి మ్యాచ్ 2023లో జరిగింది. అతను రెండేళ్ల తర్వాత ఆస్ట్రేలియా తరఫున అంతర్జాతీయ మ్యాచ్ ఆడనున్నాడు.

మిగిలిన రెండు వన్డేలు అడిలైడ్, సిడ్నీలలో జరుగుతాయి. భారత్, ఆస్ట్రేలియా మూడు వన్డేలు, ఐదు టీ20 ఐల సిరీస్ ఆడతాయి. మూడు వన్డేలు అక్టోబర్ 19, 23, 25 తేదీలలో పెర్త్, అడిలైడ్, సిడ్నీలలో జరుగుతాయి. టీ20 ఐలు అక్టోబర్ 29, నవంబర్ 8 మధ్య ఐదు వేర్వేరు వేదికలలో జరుగుతాయి.

ఆస్ట్రేలియా జట్టు: మిచెల్ మార్ష్ (కెప్టెన్), ట్రావిస్ హెడ్, మిచెల్ ఓవెన్, మాట్ రెన్షా, మాథ్యూ షార్ట్, కూపర్ కొన్నోలీ, కామెరాన్ గ్రీన్, జేవియర్ బార్ట్‌లెట్, బెన్ ద్వార్షిస్, నాథన్ ఎల్లిస్, జోష్ హాజిల్‌వుడ్, మిచెల్ స్టార్క్.

చివరి 2 వన్డేలకు: జోష్ ఇంగ్లిస్ (వికెట్ కీపర్), అలెక్స్ కారీ (వికెట్ కీపర్), ఆడమ్ జంపా.

మొదటి వన్డే కోసం: జోష్ ఫిలిప్ (కీపర్), మాథ్యూ కుహ్నెమాన్.

Printed by katikala Vara Prasad. Published by katikala Vara Prasad. Owned by katikala Vara Prasad. Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006.published at D.no465 Le out no2 .H NO : 21-119, WEST IBRAHIMPATNAM, KRISHNA, ANDHRA PRADESH - 521456.. Editor. Katikala Vara Prasad.RNI APTEL/25/A2844. Ph:9849707349 . email:kvp6858@gmail.com.